క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ 50వ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక పురపాలక సంఘ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నట్టు కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 19 అంశాలతో కూడిన అజెండాను ఇప్పటికే వార్డు కౌన్సిలర్లకు పంపించారు. గత జనవరి నెలాఖరులో జరగాల్సిన సమావేశం ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి కారణంగా వాయిదా పడిన సంగతి తెల్సిందే. ఈ సమావేశానికి వార్డు సభ్యులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

సీతారామాలయంలో పెళ్లిరాట



పెళ్లి రాట వేస్తున్న వానర సేన సభ్యులు

పాయకరావుపేట: స్థానిక మంగవరం రోడ్డులో ఉన్న సీతారామస్వామి ఆలయంలో సోమవారం ఉదయం పెళ్లి రాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు అందరూ విచ్చేసి తాంబూలం స్వీకరించి స్వామి వారి అనుగ్రహం పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వానర సేన సభ్యులు జగతా శ్రీను, కొశిరెడ్డి నాగేశ్వరరావు, మామిడి వెంకటేశ్వరరావు, ధనిశెట్టి బుజ్జి, గంగిరెడ్డి కనకరాజు, కొశిరెడ్డి నరసింహమూర్తి, ఇంటి ఈశ్వరరావు, బూడిద గౌరీ శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లకు ప్రత్యేక కౌంటర్

యలమంచిలి రూరల్: పట్టణంలో ఆస్తి పన్ను వసూళ్లకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరం ఈ నెల 31తో ముగియనుండడంతో వంద శాతం బకాయి వసూలుకు ప్రత్యేక దృష్టి పెట్టినట్టు కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు తెలిపారు. ఇందు కోసం పురపాలక సంఘ కార్యాలయంలో సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక కౌంటరు ద్వారా పన్ను వసూలు చేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని ఆయన కోరారు. పన్ను బకాయిలు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి ప్రజలు సహకరించాలన్నారు.

సత్తు కార్మికులకు ఇళ్ల స్థలాలివ్వాలి

అనకాపల్లి: అల్యూమినియం (సత్తు) కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని అనకాపల్లి అల్యూమినియం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి బుద్ద వీరభద్రరావు కోరారు. సోమవారం స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆర్చి వద్ద సంఘం వన సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడీమేడ్ వస్తువులు వచ్చిన తర్వాత అల్యూమినియం కంపెనీలో కార్మికులకు పని లేకుండా పోయిందని వాపోయారు. కూటమి ప్రభుత్వం కార్మికులకు కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కొండూరు వీరాచారి, సభ్యులు ప్రేరాజు, కె. శ్రీను, కొండూరు గిరిబాబు, పెంటకోట శ్రీనివాస్, కోన లక్ష్మణ్, ఈగల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

350 కలశాలతో భక్తుల ఊరేగింపు




గ్రామంలో కలశాలతో ఊరేగుతున్న భక్తులు

నాతవరం : శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. వీబీ అగ్రహారంలో గల శివాలయంలో 750 ఏళ్ల క్రితం ప్రతిష్ఠించిన శివలింగానికి వేదపండితులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు విశ్వశాంతి యోగం చండీ మహామృత్యుంజయ శ్రీరుద్ర యోగం తదితర కార్యక్రమాలు వేదపండితులు బ్రహ్మలింగస్వామి నాగేశ్వరశర్మ, చంద్రమౌళి, ప్రభాకర్ శర్మ,, దేవదాయధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో హోమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం శివాలయంలో 350 మంది భక్తులు కలశాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నిర్వహణ ఇలా.. నీరు పారేదెలా?

రబీలో పంటల సాగు ఇలా..

రబీ సీజన్‌లో మండల వ్యాప్తంగా పలు రకాల పంటలు సాగవుతున్నాయి. చెరువులు, కాలువల ఆధారంగా పంటలు పండిస్తుంటారు. వరి 74 హెక్టార్లు, మొక్కజొన్న 12 హెక్టార్లు, రాగి 2 హెక్టార్లు, సన్‌ఫ్లవర్ 4 హెక్టార్లు, చెరకు 61 హెక్టార్లు, కూరగాయలు 14 హెక్టార్లు, నువ్వులు 318 హెక్టార్లు, ఇతర పంటలు 8 హెక్టార్ల మేర సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఆయా పంటల సాగు కొనసాగుతోంది. కాలువలు, చెరువుల ద్వారా ఆయా పంటలకు సాగునీరు అందుతుంది. సీజన్‌కు ముందుగా అధికారులు స్పందించి కాలువలు, చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకుని ఉంటే ఇప్పుడు సాగునీటి కష్టాలు ఉండేవి కావని రైతులు అభిప్రాయపడుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న మెలిపాక సాగునీటి కాలువ గేట్లు



గణపర్తి రోలుగెడ్డలో పేరుకుపోయిన తుప్పలు, మురుగునీరు



మునగపాక: ప్రభుత్వం, నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పలు సాగునీటి కాలువలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. సీజన్‌లో పంట పొలాలకు సాగునీరు అందించేలా కాలువలు, చెరువులను అందుబాటులోకి తీసుకురావాల్సిన అధికారులు పట్టించుకోలేదు. దీంతో రబీ సాగు ప్రశ్నార్థకంగా మారింది. మునగపాక మండలంలో పలు చోట్ల కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. మరికొన్ని కాలువల్లో మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో పంట పొలాలకు సాగునీరు అందే పరిస్థితులు కనిపించడం లేదు. మునగపాకలోని కృష్ణంరాజు కాలువ, తోటాడ ఆవ కాలువ, మూలపేట చెరువు, సీలవ్వన్న చెరువు, గణపర్తి వద్ద రోలుగెడ్డ, నాగులాపల్లి కాలువ, ఉమ్మలాడ వద్ద సాగునీటి కాలువలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. రబీ సీజన్‌కు ముందు కాలువలు, చెరువులను అభివృద్ధి చేయాల్సి ఉంది. చెరువులు, కాలువల ద్వారా వచ్చే నీటి ఆధారంగా పంటల సాగు చేపట్టే రైతులు మండలంలో ఎక్కువగానే ఉన్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కాలువలు, చెరువులను మెరుగుపరచాలని రైతులు కోరుతున్నారు.

రోలుగెడ్డ తుప్పలమయం



చూచుకొండ-గణపర్తి గ్రామాల మధ్య రోలుగెడ్డ ఉంది. ఈ గెడ్డలో ప్రస్తుతం తుప్పలు పేరుకుపోయాయి. మురుగునీరు ప్రవహిస్తోంది. కాలువలు, చెరువులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి పొలాలకు నీరు అందేలా చూడాల్సి ఉంది. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– కాండ్రేగుల కిరణ్‌కుమార్, రైతు, చూచుకొండ

సాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు

సాగునీటి కాలువలు, చెరువుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే కాలువల్లో రెగ్యులేటర్లను అందుబాటులోకి తీసుకువస్తున్నాం. సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నాం. పేరుకుపోతున్న తూటికాడ తొలగింపునకు కృషి చేస్తాం. సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పని చేస్తా.

– నవీన్, నీటి పారుదల శాఖ ఏఈ

తూటిగడ్డితో నీటి ప్రవాహానికి ఆటంకం



మూలపేట, గవర్ల అనకాపల్లి, తదితర చోట్ల చెరువులు స్వరూపం కోల్పోతున్నాయి. తూటిగడ్డి పెరిగిపోతోంది. దీంతో నీటి ప్రవాహానికి ఆటంకంగా తయారైంది. సీజన్‌కు ముందుగా అధికారులు చెరువులు, కాలువలను అభివృద్ధి చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు.

– బొడ్డేడ చెల్లయ్యనాయుడు, రైతు, మూలపేట

చిన్నారులకు విద్యతో పాటు పౌష్టికాహారం



అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ బ్రోచర్స్‌ను అందిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య

పాయకరావుపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.సౌజన్య సూచించారు. పోషణ్ భీ పడాయి భీ శిక్షణ కార్యక్రమంలో భాగంగా స్త్రీశక్తి భవన్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలతో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రీ స్కూల్ విద్యార్థులకు పౌష్టికాహారం ప్రాముఖ్యత, నవ చేతన్ మోడల్, గృహ సందర్శనలు, గ్రోత్ మోనటరింగ్, అభివృద్ధి డొమైన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈసీసీఈపై సంబంధిత మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్, నేషనల్ ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ కరికలమ్, చైల్డ్ హుడ్ స్టిమ్యూలేషన్ సిఫార్సులకు అనుగుణంగా శిక్షణ ప్రణాళిక చేయడం జరిగిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యా నాణ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో పోషణ భీ పడాయి భీ శిక్షణ ఇచ్చామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈసీసీఈపై ఉపన్యాసకుడిగా డీఆర్‌పీ సిహెచ్.ప్రసాద్

డ్రోన్లతో మందుల పిచికారీపై అవగాహన



వాడ్రాపల్లిలో డ్రోన్ల ద్వారా పిచికారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మునగపాక: డ్రోన్ల ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంట పొలాలకు రసాయన మందుల పిచికారీ చేసుకోవచ్చునని ఆత్మ ఏడీ సుబ్రహ్మణ్యం తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం(ఆత్మ) ఆధ్వర్యంలో మండలంలోని వాడ్రాపల్లి, మునగపాక గ్రామాల్లో డ్రోన్ల సహాయంతో రసాయనిక ఎరువులతో పాటు ఎరువుల పిచికారీపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరా విస్తీర్ణంలో పంటకు పది నిమిషాల మేర పిచికారీ చేసుకునేందుకు డ్రోన్లు దోహదపడతాయన్నారు. ఇందుకు రూ.400 మాత్రమే ఖర్చు అవుతుందన్నారు. మారుతున్న కాలంతో పాటు రైతులు కూడా కొత్త పద్ధతులు పాటించాలన్నారు. ఏవో విజేత, మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి, ఏఈవో సాయివాణి, వీహెచ్‌ఏ తులసీ, రైతులు మళ్ల వరహా నరసింగరావు, మళ్ల జోగినాయుడు, రమణబాబు, అప్పలనాయుడు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'ఈకేవైసీ పేరుతో సంక్షేమ పథకాల కోతకు ప్రణాళిక'

పాయకరావుపేట: కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు కోత విధించడం కోసమే ప్రణాళిక చేస్తుందని అరట్లకోట గ్రామానికి చెందిన నాయకుడు గర్లంక శ్రీనివాసరావు ఓ ప్రకటనలో ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరాలన్న ధ్యేయంగా పాలన సాగించారని గుర్తుచేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు రేషన్ డిపోలో ఈకేవైసీ పేరుతో కార్డుల తగ్గింపు చేయడం , తద్వారా రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు తగ్గించడానికి ఇదొక ఎత్తుగడ అని పేర్కొన్నారు. రేషన్ డిపోల వద్దకు వృద్ధులు, మహిళలు, పిల్లలు వెళ్లి పడిగాపులు కాయాల్సి వస్తోందన్నారు. గత ప్రభుత్వంలో వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించేవారని తెలిపారు. ప్రస్తుతం చంద్రబాబు పాలనలో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా సాంబశివుని ఆలయ వార్షికోత్సవం



అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న గాయకులు

మునగపాక: మునగపాకలోని సాంబశివుని ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సాంబశివున్ని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో భాగంగా సాంబశివుని కల్యాణం కమనీయంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సాంబశివున్ని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వార్షికోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన అన్నమయ్య సంకీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి.



సాంబశివుడిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాకలో నేడు పరదేశమ్మ తల్లి పండగ



పరదేశమ్మ తల్లి అమ్మవారు

మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాకలో మంగళవారం పరదేశమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. రాత్రికి సంతబయిల తంపరమూల సంఘం విశాలాంధ్ర స్టేజిపై అద్దంలో చందమామ సాంఘిక నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. మందబయిల కొత్త మహాలక్ష్మమ్మ పురిటిగెడ్డ సంఘం ఆధ్వర్యంలో రైతు పోరాటం నాటక ప్రదర్శన కూడా జరుగుతుందన్నారు. పండగను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ముందుగా గుర్తిస్తే క్షయ నివారణ సాధ్యం



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న హరిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి రవిబాబు

అచ్యుతాపురం రూరల్ : ముందుగా గుర్తించి క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ వ్యాధిని అరికట్టవచ్చునని హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డి.రవిబాబు తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీ పరిధిలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షయ వ్యాధి నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని పీహెచ్‌సీ సిబ్బందితో రవిబాబు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి ఊపిరితిత్తులను ప్రభావితం చేయడమే కాకుండా ఒక్కోసారి మూత్ర పిండాలు, వెన్నెముక, మెదడు, గర్భాశయం వంటి కీలక అవయవాలను సైతం దెబ్బతీస్తుందన్నారు. విపరీతమైన దగ్గు, జ్వరం రావడం, ఛాతీలో నొప్పి, తలనొప్పి, నీరసం, అలసట, ఆకలి, బరువు తగ్గడం, ప్రధానంగా సాయంత్రం అవ్వగానే చలి వేయడం, రాత్రి వేళల్లో చెమటలు పట్టడం, ఛాతీలో నీరు చేరడం వంటివి క్షయ వ్యాధి లక్షణాలుగా గుర్తించి, వెంటనే ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధి పూర్తిగా తగ్గడానికి క్రమం తప్పకుండా మందులు వాడడం, మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవడం, వైద్యుల పర్యవేక్షణలో ఉంటే త్వరగా వ్యాధి నయం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మానస, ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.శ్రీనివాస్, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమా మహేష్, సిబ్బంది నాగేశ్వరరావు, జ్యోత్స్న, సుందరి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్




కోటవురట్ల స్టాల్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న స్థానికులు

కోటవురట్ల: డ్వాక్రా సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌కు మంచి స్పందన వస్తోంది. జల్లూరు యూనిట్‌కు చెందిన సభ్యులు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. యూనిట్ ఇన్‌చార్జ్ పెద్దాడ రమణమ్మ ఆధ్వర్యంలో సభ్యులు ఏర్పాటు చేసిన స్టాల్‌లో సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన తోటకూర, మెంతుకూర, గోంగూర, వంకాయలు, బీరకాయలు, దొండకాయలు, టమాటాలు విక్రయించారు. స్టాల్ ఏర్పాటు చేసిన అరగంటలో మొత్తం విక్రయించేశారు. యూనిట్ ఇన్‌చార్జ్ రమణమ్మ, సభ్యులు రవి, ప్రభావతి, మల్లేశ్వరి మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో స్టాల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్‌స్టేషన్ ఎస్.రాయవరం ఫీడర్ పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్‌లో చెట్ల కొమ్మలు తొలగింపు, మరమ్మతులు చేపట్టడం వల్ల ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ మేరకు ఎస్.రాయవరం, సర్వసిద్ధి, సైతారుపేట, వాకపాడు, ఉప్పరాపల్లి గ్రామాలతో పాటు ఆక్వా పరిశ్రమలకు కూడా విద్యుత్ అంతరాయం ఉంటుదన్నారు.

సమాచారం అడిగితే ఇవ్వరా?



స.హ చట్టం దరఖాస్తు చూపుతున్న సత్యనారాయణమూర్తిరాజు

ఎస్.రాయవరం: మండలంలో సమాచారం హక్కు చట్టం కింద దరఖాస్తు చేస్తే సమాచారం ఇచ్చే పరిస్థితి ఉందా? లేదా? అని పెదగుమ్ములూరు గ్రామానికి చెందిన రైతు యేజర్ల సత్యనారాయణ మూర్తి రాజు ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో తన పొలంకి సమీపంలో ఉన్న కొండగెడ్డ గోర్జును రియల్ ఎస్టేట్ నిర్వాహకులు ఆక్రమించి కప్పేశారని ఆరోపించారు. వర్షపు నీరు పొలాల్లో నుంచి దిగువకు కొండగెడ్డకు పోయేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఈ ప్రాంతంలో తనతో పాటు మరికొంత మంది రైతులకు సమస్య రావడంతో కొండగెడ్డ భౌతిక స్వరూప సమాచారం కోసం రెవెన్యూ అధికారులకు తాను దరఖాస్తు చేసినట్టు చెప్పారు. అయితే 30 రోజుల్లో ఇవ్వాల్సిన సమాచారం మూడు నెలలు గడుస్తున్నా అతీగతి లేదన్నారు. అసలు మండలంలో అధికారులు సమాచార హక్కు దరఖాస్తుదారులకు సమాచారం ఇస్తున్నారా? లేదా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు నష్టం కలిగించే పనులు మానుకుని ఉన్న వనరులను యథావిధిగా కొనసాగించాలని కోరారు.

అటవీ భూముల్లో సాగుదారులకు హక్కులు కల్పించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

ఎస్.రాయవరం: ప్రభుత్వ అటవీ భూముల్లో దశాబ్దాలుగా సాగు చేస్తున్న తమకు హక్కు కల్పించి ఆదుకోవాలని బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ బంగారమ్మపాలెం పరిసరాల్లో సుమారు 40 ఏళ్లుగా రైతులు సరుగుడు, జీడి, కొబ్బరి తోటలు సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారన్నారు. అటువంటి వారిపై అటవీ శాఖాధికారులు అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. పేద రైతులపై పెడుతున్న కేసులను వెనక్కి తీసుకుని సాగుదారులు గుర్తించి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మైలపల్లి మాధవ, కారే దేవుడు, మైలపల్లి కాశి, కారే అప్పారావు, కారే కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

హిజ్రా దీపు కుటుంబానికి అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్ పరామర్శ



దీపు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భరత్‌కుమార్, పార్టీ శ్రేణులు, ట్రాన్స్‌జెండర్లు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం పెదబోయిగూడెం వీధిలో ఇటీవల హత్యకు గురైన ట్రాన్స్‌జెండర్ మైపాలి దిలీప్ శివశంకర్(దీపు) కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సోమవారం రాత్రి పరామర్శించారు. అంతకుముందు దీపు చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపు కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందన్నారు. దీపు కుటుంబానికి కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. ట్రాన్స్‌జెండర్లకు దివ్యాంగుల కోటాలో ఉపాధి కల్పించాలన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ట్రాన్స్‌జెండర్లకు సంక్షేమ పథకాలు అందించేవారని, కూటమి పాలనలో వాటిని తక్షణమే అందజేయాలని కోరారు. హత్యకు కారణమైన నిందితుడికి తక్షణమే శిక్షణపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏఎంసీ కాలనీలో ట్రాన్స్‌జెండర్ సంఘం సభ్యుల పరిస్థితిని అడిగి తెలుసుకుని సంఘీభావం వ్యక్తం చేశారు. 80వ వార్డు పార్టీ ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, అనకాపల్లి, కశింకోట మండలాల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు-2 వేగి త్రినాథ్, పార్టీ నాయకులు మైపాలి నూకరాజు, నాగేష్, జ్ఞానదీప్, పెంటకోట శ్రీనివాసరావు, మారిశెట్టి శ్రీను, కాండ్రేగుల రాము, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం మహాధర్నా



ధర్నా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

నర్సీపట్నం : ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో మహాధర్నా, దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ సీపీఎం ప్రజా చైతన్యయాత్రలో గుర్తించిన సమస్యలను ప్రభుత్వం దృష్టిలో పెట్టేందుకు మహాధర్నా చేపట్టామన్నారు. మున్సిపాలిటీ పేదలకు టిడ్కో గృహాలను పంపిణీ చేయాలని, ఏరియా ఆస్పత్రిలో శానిటేషన్ సిబ్బంది, స్టాఫ్ నర్స్‌లు, వైద్యులను నియమించాలని, ఫారెస్ట్, రెవెన్యూ పోడు భూములకు సాగు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గొలుగొండ మండలం , జోగంపేట గ్రామానికి చెందిన దళితులకు కోటవురట్ల మండలం, పందూరులో ఇచ్చిన సీలింగ్ భూములను దళితలకు అప్పగించి రక్షణ కల్పించాలన్నారు. బలిఘట్టం వాసులకు భూములు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం గొలుగొండ మండల కార్యదర్శి రాజుబాబు, సాపిరెడ్డి నారాయణమూర్తి, ఎల్.గౌరి, సూర్యప్రభ. జి.శివ, సత్తిబాబు, ప్రసన్న పాల్గొన్నారు.

రైతులకు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాలని ధర్నా

అనకాపల్లి: ల్యాండ్ పూలింగ్‌లో భూములు సేకరించిన రైతులకు నిబంధన ప్రకారం అభివృద్ధి చేసిన వుడా ప్లాట్లను వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శంకరరావు, మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం వారు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో కూండ్రం, కుంచంగి, రొంగలివానిపాలెం, వెటజంగాలపాలెం. సీతానగరం, మామిడిపాలెం, కొండుపాలెం, పాపయ్య సంతపాలెం, కోడూరు రెవెన్యూ గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ ద్వారా రైతుల నుంచి భూములు సేకరించి నాలుగేళ్లు దాటినా ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా తాత్సారం చేయడం దారుణమన్నారు. దీనిపై ప్రజా ప్రయోజనార్థం బలవంతంగా ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు సమీకరించవద్దని హైకోర్టులో పిటిషన్ వేశామన్నారు. జీడి, మామిడి తోటలను తొలగించడం వల్ల రూ.60 వేల నుంచి రూ.2 లక్షల వరకూ ఒక్కొక్క రైతుకు ప్రతి సంవత్సరం నష్టం వాటిల్లుతోందన్నారు. ఆ నష్టాన్ని పూడ్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉందన్నారు. తక్షణమే ప్లాట్లును రైతులకు రిజిస్ట్రేషన్ చేయాలని, రాజధాని అమరావతి రైతులు మాదిరిగా ప్రతి రైతు కుటుంబానికి ఏటా కౌలు చెల్లించాలని, నేటివరకూ నష్టపోయిన పంటలకు పరిహారం వడ్డీతో సహా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు అల్లు రాజు, బొప్పే ఉమామహేశ్వరరావు, కాళ్ల తేలయ్య బాబు, కె.ఈశ్వరరావు, జి.సుభాషిణి, చలపతి, బుగిడి నూకఅప్పారావు, రైతులు పాల్గొన్నారు.